క్లుప్తంగా

కల్యాణలక్ష్మి చెక్కుల అందజేత



చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో 41మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అందజేశారు. నిరుపేదలైన తల్లిదండ్రులు కుమార్తెల వివాహానికి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండాలన్నారు. ఒక పెద్దన్న పాత్ర పోషిస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి కింద ఆదుకుంటున్నారని అన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: దత్తాత్రేయ కాలనీ, గురు గోవిందసింగ్ నగర్, మహంకాళి నగర్‌లలో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సోమవారం ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 37 లక్షల 50 వేల రూపాయలతో చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

'మనూ' పరిశోధక విద్యార్థికి పీహెచ్‌డీ

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థికి సోమవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. యూనివర్సిటీలోని ఇస్లామిక్ స్టడీస్ విభాగంలో పరిశోధక విద్యార్థి మహ్మద్ సలాడుద్దిన్ 'భారతీయ విశ్వవిద్యాలయాల్లో ఇస్లామిక్ అధ్యయనాలు: ఒక విశ్లేషణాత్మక అధ్యయనం' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. ఆయన ఇస్లామిక్ స్టడీస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎండి ఇర్ఫాన్ అహ్మద్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేశారు.

ఓయూలో కాన్షీరాం వర్ధంతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీఎస్పీ వ్యవస్థాపక అధ్యక్షులు కాన్షీరాం వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సోమవారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బొరెల్లి సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షులు మహేష్ ఆధ్వర్యంలో జరిగిన మరో కార్యక్రమంలో కాన్షీరాం చిత్రపటానికి నివాళి అర్పించారు.

హాస్టల్ వసతికి ఆందోళన

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో హాస్టల్ వసతి కోసం పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ రూ.3 వేలకు మెస్ రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. అయితే.. పీజీ మొదటి సంవత్సరం మెస్ బకాయిలను పూర్తిగా చెల్లిస్తేనే హాస్టల్ వసతి కల్పిస్తామని అధికారులు చెప్పడంతో రోడ్డు పై వంటావార్పుతో ధర్నా చేపట్టగా ఓయూ పోలీసులు 40 మంది విద్యార్థులను అరెస్ట్ చేశారు.

ఎన్నికల కోడ్‌తో వర్సిటీల సిబ్బంది నిరాశ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్నికల కోడ్ అమలుతో వర్సిటీల అధ్యాపకులు నిరాశ చెందారు. గత పదేళ్లుగా ఆందోళనలు చేస్తున్న ఉద్యోగాలు పర్మనెంట్ చేయకుండా సీఎం కేసీఆర్ అన్యాయం చేశారని కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. జేఎల్, డీఎల్, పాలిటెక్నికల్ కాలేజీల అధ్యాపకులను పర్మనెంట్ చేసి చివరకు ఆర్టీసీ ఉద్యోగులను సైతం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన సీఎం కేసీఆర్ యూనివర్సిటీల సిబ్బందిని ఇబ్బందులకు గురి చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

పోస్టు ఎమ్మెస్సీ రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ సైన్స్ కాలేజీ ఫిజిక్స్ విభాగంలో కొనసాగుతున్న రెండు సంవత్సరాల పోస్టు ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించే అర్హత పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.పాండురంగారెడ్డి సోమవారం తెలిపారు. ఎమ్మెస్సీ ఫిజిక్స్ లేదా న్యూక్లియర్ ఫిజిక్స్ కోర్సును 60 శాతం మార్కులతో పూర్తి చేసిన అభ్యర్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులు. నవంబరు 19న జరిగే ప్రవేశ పరీక్షకు సక్తి గల అభ్యర్థులు ఈ నెల 31 వరకు, రూ.500 అపరాధ రుసుంతో వచ్చే నెల 10 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మోగిన ఎన్నికల నగారా

కూకట్‌పల్లి వివిధ పార్టీల నేతల్లో మొదలైన టెన్షన్

- స్థానికేతరులకు ఇస్తే ఊరుకోమంటున్న స్థానిక కాంగ్రెస్ నేతలు
- బీజేపీ అభ్యర్థి ప్రకటనపై స్పష్టత లేకపోవడంతో ఎవరికి వారే ప్రచారం
- నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీలో తేలని టికెట్ల పంచాయితీ
- పాదయాత్రతో నియోజకవర్గాన్ని చుట్టేసి దూకుడు మీదున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: ఎన్నికల కోడ్ రావటంతో అన్ని పార్టీల్లో టెన్షన్ మొదలయ్యింది. ముఖ్యంగా నగరంలో అంతర్భాగమైన కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాధవరం కృష్ణారావు పలు దఫాలుగా నియోజకవర్గాన్ని పాదయాత్రతో చుట్టుముట్టేశారు. దీంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించుకుంటూ తన పని తాను చేసుకుంటూ ముందంజలో ఉన్నారు. ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలో ఇప్పటి వరకు టికెట్ల పంచాయితీ తేలలేదు.

కాంగ్రెస్, బీజేపీను నమ్ముకున్న వారికి ప్రాధాన్యం కరువు...

◆ నియోజకవర్గంలో కాంగ్రెస్,బీజేపీను నమ్ముకుని పనిచేసే వారికి ప్రాధాన్యం కరువైందని స్థానిక ద్వితీయ శ్రేణి నాయకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. టికెట్ కోసం పోటీ పడేవారు మాత్రం తమను కాదని ఈ ప్రాంతంలో పోటీకి వస్తే తాము సహించేది లేదని హెచ్చరిస్తున్నారు. అవసరమైతే ప్రతిఘటన చేయటానికి కూడా వెనుకాడమని తేల్చి చెబుతున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి తానేనంటూ ఓ వ్యక్తి ప్రచారం..

◆ కాంగ్రెస్‌లో పీసీసీ నుంచి ఓ వ్యక్తి తానే అభ్యర్థినంటూ కార్యకర్తలకు తెలియకుండా ప్రచార మాధ్యమాల్లో ప్రచారం చేసుకుంటున్నారు. మరో వైపు కాంగ్రెస్‌కు సంబంధం లేని వ్యక్తి కాంగ్రెస్ గుర్తు, నాయకుల ఫొటోలతో ఎంత ప్రచారం చేసినా క్షేత్రస్థాయిలోకి వస్తే తాము ఊరుకోమని గతంలోనే నియోజకవర్గ స్థానిక నాయకత్వం బల్లగుద్ది మరీ చెప్పింది.

స్థానికులకు టికెట్ రాదని ప్రచారం..

◆ ఓ వైపు స్థానికులకు టిక్కెట్ రాదని ప్రచారం జరుగుతున్నప్పటికీ మరో వైపు స్థానికేతరులు, పార్టీ అధిష్టానం నిర్ణయించిన వారు ఈ నియోజకవర్గంలో పోటీ చేస్తారని జోరుగా ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా స్థానికంగా ఉన్న నాయకత్వం తమకు అనుకూలంగా ఉన్న నాయకుడినే అభ్యర్థిగా నిలబెట్టాలని.. మరో వైపు కార్యకర్తల నుంచి నిరసన గళాలు వినబడుతున్నాయి.

కాంగ్రెస్ ఇద్దరు–ముగ్గురు అభ్యర్థులపై సర్వేలు..

◆ అయితే కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇప్పటి వరకు పార్టీ అభ్యర్థుల పట్ల పూర్తి స్థాయిలో స్పష్టత రాలేదు. ఇప్పటికే ఇద్దరు–ముగ్గురు అభ్యర్థులపై సర్వేలు నిర్వహిస్తున్నామని చెబుతున్నప్పటికీ అధిష్టానం మాత్రం సామాజిక కోణంలో సెటిలర్ వ్యక్తిని బరిలోకి దించాలని ప్రయత్నిస్తుండగా దానికి స్థానిక నాయకత్వం మాత్రం ఒప్పుకోవటం లేదు. ఈ విషయంలో గత వారం రోజులుగా ఇక్కడి నాయకులు ఢిల్లీ స్థాయిలో వెళ్లి పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది.

బీజేపీలోనూ అభ్యర్థుల ఎంపికపై స్పష్టత కరువు..

మరో వైపు బీజేపీ కూడా అభ్యర్థుల విషయంలో పూర్తి స్థాయిలో స్పష్టత ఇవ్వటం లేదు.దాదాపు అరడజను మందిని అభ్యర్థులుగా చూపిస్తూ నియోజకవర్గంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ సందర్భంగా అందరూ ఎవరికి వారే అభ్యర్థులుగా ప్రచారం చేసుకుంటూ నియోజకవర్గంలో తిరుగుతున్నారు.

◆ ఎలాంటి సమాచరాం ఇవ్వకుండా వారి మధ్యనే పోటీ పెంచుతూ అధిష్టానం టెన్షన్ వాతావరణాన్ని సృష్టిస్తోందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇటీవల ఇద్దరు, ముగ్గురు నాయకులు తమ బలంతో పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు విస్తృతంగా ప్రచారాన్ని ప్రారంభించారు. అధిష్టానం నాయకుల ఎలాంటి స్పష్టత లేకున్నా మద్దతు తమకే ఉందంటూ ప్రచారం చేసుకుంటున్నారు.

మొదటి జాబితాలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల పేర్లు ప్రకటించకపోవచ్చు..

అయితే మొదటి జాబితాలో కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల పేర్లు ప్రకటించకపోవచ్చనే ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనప్పటికీ ఈ నెల చివరిలో లేదా వచ్చే నెల ప్రారంభంలో అభ్యర్థులపై స్పష్టత వచ్చే అవకాశం ఉందనే సంకేతాలు వస్తున్నాయి.

'నటుడు శ్రీహరి తెలుగువారి గుండెల్లో నిలిచిపోయారు'





శ్రీహరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు సతీష్‌గౌడ్, రవీందర్‌రెడ్డి
అన్నదానం చేస్తున్న నాయకులు

బాలానగర్: బాలానగర్, ఫతేనగర్ గ్రామ ప్రజలకు సినీ నటుడు శ్రీహరికి ఉన్న అనుబంధం ఎనలేనిదని కార్పొరేటర్లు ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్ అన్నారు. సోమవారం శ్రీహరి 10వ వర్ధంతిని రోడ్డు నం.4 శోభన కాలనీలో ఆయన కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు శ్రీహరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగువారి గుండెల్లో శ్రీహరి చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. శ్రీహరి సినిమాల్లోనే కాదు, రాజకీయాల్లోనూ అఖండ శిఖరంలా నిలిచి తనదైన ముద్ర వేశారన్నారు. శ్రీహరి అందరికీ నచ్చే అరుదైన వ్యక్తి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి సోదరులు రఘుముద్రి శ్రీనివాస్‌రావు, రఘుముద్రి శ్రీధర్, ఫతేనగర్ డివిజన్ కాపు అధ్యక్షుడు తోట శివాజీ, సురేందర్ నాయుడు, గంగా రాజు, రమేష్, పవన్, బాబా, మహాలక్ష్మీ, బోగాది శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలను పంపిణీ



శంషీగూడ ప్రభుత్వ పాఠశాలలో చీరలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

భాగ్యనగర్‌కాలనీ: తెలంగాణ ఆడపడుచులకు సారెగా అందిస్తున్న బతుకమ్మ చీరలను సోమవారం శంషీగూడ ప్రభుత్వ పాఠశాలలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేదింటి ఆడపడుచులు కూడా పండుగను ఆనందంగా జరుపుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో తెలంగాణ సర్కారు బతుకమ్మ చీరలను అందిస్తోందన్నారు. చీరల తయారీని నేత కార్మికులకు అప్పగించి వారి బతుకుల్లో వెలుగులు నింపుతోందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షులు కాశీనాథ్‌యాదవ్, శివరాజ్‌గౌడ్, బోయకిషన్, పోశెట్టిగౌడ్, డివిజన్ మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, వల్లి, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ఉండాలి



మాట్లాడుతున్న పండిట్ వికాష్‌శర్మ

సనత్‌నగర్: బేగంపేట మయూరిమార్గ్‌లోని దేవనార్ అంధుల పాఠశాలను అఖిల భారత సామాజిక వికలాంగుల హక్కుల కార్యకర్త పండిట్ వికాష్‌శర్మ సోమవారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాలను ఆయన పర్యవేక్షించారు. అలాగే అక్కడి చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా దేశంలో దివ్యాంగుల సంక్షేమం కోసం ఎన్నో కార్యక్రమాలు అమలవుతున్నాయన్నారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసి తమ లక్ష్యాలను చేరువ కావాలని సూచించారు. కార్యక్రమంలో దేవనార్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సాయిబాబాగౌడ్, కరస్పాండెంట్ జ్యోతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


డీఎస్పీకి స్టూడెంట్ వింగ్ ఏర్పాటు

ఉస్మానియా యూనివర్సిటీ: ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ)కి స్టూడెంట్ వింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం ఓయూ క్యాంపస్ దూరవిద్య కేంద్రంలో జరిగిన ఆవిర్భావ సభలో డీఎస్పీ అధినేత డాక్టర్ విశారదన్ ముఖ్య అతిథిగా పాల్గొని స్టూడెంట్ వింగ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. విద్యార్థి హక్కులు, సమస్యలపై నిస్వార్థంగా పోరాడనున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.కార్తీక్, కోఆర్డినేటర్ సైదబాబు, లింగయ్య, విష్ణు, దశరథ్, శివ, సదానంద, శివ, సుబాష్, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డా.విశారదన్

ఫైన్‌ఆర్ట్స్ వర్సిటీ హాస్టల్‌లో ప్రవేశాలకు వినతి



వినతి పత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: జేఎన్ఏఎఫ్‌యూ (ఫైన్ ఆర్ట్స్ వర్సిటీ) హాస్టల్‌లో విద్యార్థులకు ప్రవేశాలు చేపట్టాలని ఏబీవీపీ నాయకులు సోమవారం రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.లింబాద్రికి వినతి పత్రం సమర్పించారు. హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో గత మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించడం లేదని ఏబీవీపీ నాయకులు భరత్‌కుమార్ పేర్కొన్నారు. హాస్టల్ వసతి లేనందున విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే హాస్టల్ భవనానికి మరమ్మతులు చేపట్టి ప్రవేశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వినతి ఇచ్చిన వారిలో శ్రీమంత్ కుమార్, విజయ్, సురేందర్, రోహన్, శ్యామ్ చరణ్ ఉన్నారు.

ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలి



ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: దేవీ శరన్నవరాత్రి, బతుకమ్మ ఉత్సవాలను వైభవంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆయా ఉత్సవాల నిర్వహణపై సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో సోమవారం జరిగిన సమీక్షా సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈఓ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఉత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జీహెచ్‌ఎంసీ, వాటర్‌వర్క్స్ అధికారుల సమన్వయంతో ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బతుకమ్మ నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా నీటి సదుపాయం జరిగేలా చూస్తామన్నారు. అలాగే పండుగలు ఘనంగా జరుపుకోవాలనే సంకల్పంతో ఆలయాలకు ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయిస్తోందన్నారు. విజయదశమి రోజున రావణ దహనం, శమీపూజ వంటి కార్యక్రమాలు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్న దృష్ట్యా అందుకనుగుణంగా ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కొలను బాల్‌రెడ్డి, అర్చకులు రవీంద్రాచార్యులు, సుదర్శనాచార్యులు, గణేష్ కులకర్ణి, గోపాల్‌జోషి పాల్గొన్నారు.

అరుదైన ఘనత సాధించిన 'ఐఎస్‌బీ'

రాయదుర్గం: జాతీయ, అంతర్జాతీయ స్థాయి బిజినెస్ స్కూళ్లలో ప్రత్యేకతను సాధించిన గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) మరో అరుదైన ఘనత సాధించింది. ప్రపంచంలోని కొన్ని బిజినెస్ స్కూళ్లలో ఐఎస్‌బీ అక్రిడిటేషన్ల 'ట్రిపుల్ క్రౌన్'ను నిలబెట్టుకున్న బిజినెస్ స్కూల్‌గా గుర్తింపు సాధించింది. పోస్టు గ్రాడ్యుయేట్ బిజినెస్ ఎడ్యుకేషన్‌లో ప్రపంచంలోని ప్రముఖ అధికారులలో ఒకటైన అసోసియేషన్ ఆఫ్ ఎంబీఏ (ఏఎంబీఏ) నుంచి ఐఎస్‌బీ అధికారికంగా రీ– అక్రిడిటేషన్ పొందింది. ఐఎస్‌బీ అకడమిక్ ప్రోగ్రామ్స్ డిప్యూటీ డీన్ ప్రొఫెసర్ రామభద్రన్ తిరుమలై మాట్లాడుతూ ఐఎస్‌బీ ప్రపంచవ్యాప్తంగా ఏఎంబీఏ చేత గుర్తింపు పొందుతున్నందుకు ఎంతో సంతోషం. ఐఎస్‌బీలో పనిచేసే అందరి సమిష్టి కృషికి ఇది నిదర్శనం.

32 గ్రాముల కొకైన్ పట్టివేత

నలుగురు అరెస్ట్

గచ్చిబౌలి: కొకైన్ తరలిస్తున్న నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రాయదుర్గం సీఐ మహేష్ తెలిపారు. మణికొండలో నివాసం ఉండే తోట క్రాంతికిరణ్(45) స్థానికంగా నివాసం ఉండే నరేష్ గోపీశెట్టి(36) వద్ద 32 గ్రాముల కొకైన్ కొనుగోలు చేస్తుండగా మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. నరేష్‌ను విచారించగా తన సోదరుడు రాజేష్ గోపీశెట్టి (38)నుంచి కొకైన్ తీసుకున్నట్లు వెల్లడించారు. రాజేష్‌ను విచారించగా హఫీజ్‌పేట్‌లో నివాసముండే రాజమండ్రికి చెందిన డ్రగ్ పెడ్లర్ బొమ్మదేవర వీరరాజు(29) నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. తరచుగా వీరరాజు గోవాకు వెళ్లి డ్రగ్స్ రవాణ చేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. 32 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రచయిత్రి నికితాదేశ్ పాండేకు శ్రీనివాస్‌రాయప్రోల్ అవార్డు



రాయదుర్గం: ముంబాయికి చెందిన రచయిత్రి నికితా దేశ్‌పాండేకు 15వ శ్రీనివాస్‌రాయప్రోల్ కవితా అవార్డును ప్రకటించారు. గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని ఆంగ్ల విభాగం, శ్రీనివాస్ రాయప్రోల్ లిటరరీ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతియేటా ఈ అవార్డును అందిస్తారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా 120 మంది యువ రచయిత్రుల నుంచి ఎంట్రీలను స్వీకరించగా ఆమెను జ్యూరీ ఎంపిక చేసింది. త్వరలో జరిగే సాహిత్య కార్యక్రమంలో విజేతకు అవార్డుతోపాటు ప్రశంసాపత్రం, రూ.15వేల నగదు పురస్కారం అందిస్తారు.

సకల సౌకర్యాలతో ధోబీఘాట్ నిర్మాణం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండలో ఎమ్మెల్యే నిధులు రూ.10లక్షల వ్యయంతో చేపట్టబోయే ధోబీఘాట్ నిర్మాణ పనులను సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ దోబీ ఘాట్ నిర్మాణం ఇక్కడి ప్రాంత రజక వాసులకు చాలా ఉపయోగపడుతుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు, ధోబీఘాట్ నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. నాణ్యతా విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అన్ని హంగులతో, సకల సౌకర్యాలతో ధోబీఘాట్ నిర్మాణం చేపడుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు కాశీనాథ్‌యాదవ్, శివరాజ్ గౌడ్, బోయ కిషన్, ప్రసాద్, వెంకట్ నాయక్, సీహెచ్. అశోక్, కాయితి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



వడ్డేపల్లి రాజేశ్వరరావు సమక్షంలో చేరిన బాలాజీనగర్ డివిజన్ యువకులు

కూకట్‌పల్లి: ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులైన యువకులు బీజేపీలో చేరుతున్నారని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. సోమవారం బాలాజీనగర్ డివిజన్‌కు చెందిన యువ నాయకుడు పి.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు వారికి పార్టీ కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరటం ఖాయమని ఆయన అన్నారు. తమ పార్టీలో చేరికలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు నాగరాజు, స్టేట్ బీజేవైఎం సోషల్ మీడియా కన్వీనర్ అక్కినపల్లి సాయి, బూత్ అధ్యక్షుడు సాయికిరణ్, ఆనంద్‌కుమార్, మధు, శ్రీశైలం, మల్లికార్జున్, శ్రీనివాస్, శివ, సాయికుమార్, నాగరాజు, సంతోష్, రాజేష్, ఆదర్శ్, రిషి, సాయి, చందు తదితరులు పాల్గొన్నారు.

చైతన్య యాత్రకు స్పందన



చైతన్య యాత్రలో విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓటు చైతన్యం–రాజకీయ భాగస్వామ్యం కోసం తెలంగాణ విద్యార్థి రాజకీయ జేఏసీ నాయకులు చేపట్టిన చైతన్య యాత్రకు విశేష స్పందన లభిస్తోందని జాక్ చైర్మన్ చంద్రశేఖర్ తెలిపారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీలో ప్రారంభమైన యాత్ర రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పర్యటించి ప్రజలను చైతన్య పర్చనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలిగొండ నరసింహ, వంశీనాయక్, లత విశ్వజన్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హామీలను అమలు చేయాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో నవంబర్ 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు గిరిజనుల హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, ప్రధాన కార్యదర్శి అంజయ్య నాయక్‌లు డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు మాట్లాడుతూ.. ఆయా పార్టీలు తమ మ్యానిఫెస్టోలో గిరిజనుల డిమాండ్లను చేర్చాలన్నారు. ఓట్ల కోసం వాగ్దానాలు చేస్తూ.. అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా మోసం చేస్తున్నారని ఆరోపించారు. అలాంటి వాగ్దానాలకు మోసపోకుండా గిరిజన సమాజం చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన తరువాత ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంతో ఆయా సర్పంచ్‌లు అప్పులపాలై 15 మంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 15 లక్షల ఎకరాల పోడు భూములకు హక్కు పత్రాలు ఇస్తామన్న సీఎం కేసీఆర్ కేవలం రూ.4 లక్షల ఎకరాలకు మాత్రమే హక్కు పత్రాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. గిరిజన సంఘం అధ్యక్షుడు ధర్మానాయక్, గిరిజన మేధావుల ఫోరం అధ్యక్షులు ధనుంజయ్‌నాయక్, సేవాలాల్ సేనా అధ్యక్షుడు రాంబాబునాయక్ తదితరులున్నారు.

యువహో.. జయహో..

- గెలుపు, ఓటములను ప్రభావితం చేసేది వీరే..
- 18 నుంచి 39 ఏళ్ల వయస్సు ఉన్న ఓటర్లు 12.90లక్షలు
- మేడ్చల్ జిల్లాలో మొత్తం ఓటర్లు 26.91లక్షలు



సాక్షి,మేడ్చల్‌జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో యువ ఓటర్లు 47.96 శాతం ఉన్నారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు ఓటములను ప్రభావితం చేసే సత్తా వీరి చేతిలోనే ఉంది. దాదాపు సగం ఓటర్లు వీరే ఉండటంతో రానున్న అన్ని ఎన్నికల్లో యువతే నేతల రాత రాయనున్నారు. జిల్లా పరిధిలో మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలు ఉన్నాయి. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 26,91,167 మంది ఓటర్లు ఉండగా, అత్యధికంగా కుత్బుల్లాపూర్‌లో 6,69,253 మంది ఓటర్లు ఉన్నారు. కూకట్‌పల్లిలో తక్కువగా 4,47,523 మంది, ఓటర్లు ఉండగా, మేడ్చల్‌లో 5,95,382 మంది, మల్కాజిగిరిలో 4,68,822 మంది ఉప్పల్ నియోజకవర్గంలో 5,10,167 మంది ఓటర్లు ఉన్నారు. మేడ్చల్ జిల్లాలో పురుష ఓటర్లు 13,95,033 మంది ఉండగా, మహిళా ఓటర్లు 12,95,773 మంది ఉన్నారు.

వయస్సు వారీగా ఓటర్లు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 18–19 ఏళ్ల వయస్సు ఉన్న ఓటర్లు 41,715 మంది ఉండగా, 20–29 ఏళ్లున్న ఓటర్లు 4,43,403 మంది ఉన్నారు. 30–39 ఏళ్ల ఓటర్లు 8,05,680 మంది, 40–49 ఏళ్లు ఉన్న ఓటర్లు 6,45,334 మంది, 50–59 ఏళ్లు ఓటర్లు 3,89,579 మంది ఉన్నారు. 60–69 ఏళ్లు ఉన్న ఓటర్లు 2,22,554 మంది ఉండగా, 70–79 ఏళ్ల ఓటర్లు 1,10,022 మంది ఉన్నారు. జిల్లాలో 80 ఏళ్లు పైబడిన ఓటర్లు 32,880 మంది ఉన్నారు.

ఓటరు నమోదుపై ప్రచారం..

కొత్త ఓటర్లను నమోదు చేయడంతో జిల్లా అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం చేసింది. బస్తీలు, పట్టణాలు, గ్రామాలలో ఓటరు నమోదు ప్రచార కార్యక్రమం చేసింది. ముఖ్యంగా విద్యాసంస్థల్లో ప్రచార హోరును పెంచింది. 18ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవచ్చు. చాలా ప్రాంతాల్లో యువతి, యువకులు పూర్తిస్థాయిలో ఓటుహక్కుపై దృష్టి సారించేలా చేసిన కృషి ఫలించింది. కొన్నిచోట్ల రాజకీయ పార్టీల నేతలు దగ్గరుండి కొత్త ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టారు. దీంతో ఈసారి కొత్త ఓటర్లు 1,01,022 మంది పెరిగారు.

నూతన ఓటర్లు 1.01 లక్షలు

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటును వినియోగించుకోవడానికి కొత్త ఓటర్లు సిద్ధమవుతున్నారు. ఈసారి 1,01,022 మంది నూతనంగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో అత్యధికంగా 29,705 మంది కొత్త ఓటర్లుండగా, తక్కువగా ఉప్పల్ నియోజకవర్గంలో 11,310 మంది ఉన్నారు. ఎన్నికల సమయం కావడంతో రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు కొత్త ఓటర్లపై ఎక్కువగా దృష్టి సారించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132